క్లుప్తంగా

వీరుళ్లమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే దంపతులు



అనపర్తిలో వీరుళ్లమ్మ వారిని దర్శించుకుంటున్న డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు

పెదపూడి: ప్రసిద్ధి చెందిన అనపర్తిలోని వీరుళ్లమ్మ వారి జాతర మహోత్సవాలు ఉత్సాహంగా నిర్వహించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలో ఈ నెల 14 నుంచి 18 వరకు జరిగే వీరుళ్లమ్మ జాతర మహోత్సవాల సందర్భంగా అమ్మవారిని డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆయన భార్య ఆదిలక్ష్మి దంపతులు సోమవారం దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్తి వెంకటరామారెడ్డి, కమిటీ ప్రతినిధులు సత్తి రామకృష్ణారెడ్డి, పడాల కల్యాణ రెడ్డి, మేడపాటి రామకృష్ణారెడ్డి, మేడపాటి శివశంకర్‌రెడ్డి, గొలుగూరి తిరపారెడ్డి, మేడపాటి వెంకటరమణారెడ్డి, నాగమణి, హనుమంత్, సత్తి శ్రీనివాసారెడ్డి, గంధం వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రశేఖర స్వామికి ప్రత్యేక పూజలు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న కాత్యాయనీ సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భోగి పండగ, స్వామివారి జన్మ నక్షత్రమైన ఆరుద్ర, సోమవారం పౌర్ణమి కావడంతో దీనిని శివ ముక్కోటిగా పిలుస్తారు. అరుదుగా వచ్చే రోజు కావడంతో తెల్లవారుజాము నుంచి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించినట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం జరిగింది.

భారీ అన్న సమారాధన

బిక్కవోలు: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని పందలపాకలోని సరిపల్లిపేట రామాలయం వద్దనున్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్న సమారాధన జరిగింది. ఈ నెల 10న ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ నేపథ్యంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

బిక్కవోలు: పందలపాక గ్రామంలో పేదలకు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. చాకలిపేటలోని చర్చి వద్ద మాజీ జెడ్పీటీసీ డాక్టర్ కిలపర్తి సత్యనారాయణ సమకూర్చిన దుప్పట్లను 30 మంది పేదలకు అందించారు. ఈ సందర్భంగా పాస్టర్ ఎం.రత్నం ప్రత్యేక ప్రార్థన చేశారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి దాతను అభినందించారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు.

విజేతలకు బహుమతి ప్రదానం

బిక్కవోలు: మంచి భవిష్యత్తు నిర్దేశించుకునేందుకు స్వీయ మార్గదర్శకులు కావాలని మాజీ రాష్ట్ర యువజన సంఘాల సమితి జాయింట్ సెక్రటరీ గొలుగూరి సత్యనారాయణరెడ్డి (జీఎస్ఎన్ రెడ్డి)అన్నారు. జాతీయ యువజన వారోత్సవాలు, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా తొస్సిపూడిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందించారు. ఆయన మాట్లాడుతూ మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటే మరింత అభివృద్ధి సాధించగలమన్నారు. ఈ కార్యక్రమంలో తొస్సిపూడి డిజిటల్ అసిస్టెంట్ కర్రి రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సంప్రదాయాలపై యువతకు అవగాహన కల్పించాలి

రంగంపేట: యువతకు సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంలో పెద్దలు బాధ్యత తీసుకోవాలని ఎస్సై తోట కృష్ణసాయి అన్నారు. పెద రాయవరం గ్రామంలో దుర్గాదేవి, శివాలయాల కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పల్లెల్లో ఉన్న ప్రకృతి అందాలు, పండగల ప్రాధాన్యాన్ని చిన్నారులకు తెలియజేయడంలో తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. సమాజ హిత కార్యక్రమాల్లో పాల్గొన్న గ్రామస్తులను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రంగవల్లుల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కోడిపందేలు ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేలు ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ సోమవారం తెలిపారు. చినకొండేపూడి పంచాయతీలోని పెదకొండేపూడి తోటల్లో కోడిపందేలు ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,650 స్వాధీనం చేసుకున్నామన్నారు. అదేవిధంగా ఉండేశ్వరపురంలో కోడి పందేలు ఆడుతున్న మరో ముగ్గురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.1,450 స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై కేసులు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు.

పల్లెల్లో భోగి వెలుగులు



రాజానగరంలోని సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన భోగి మంట

- సంప్రదాయానికి అద్దం పట్టిన పండగ
- సంక్రాంతి సంబరాలకు శ్రీకారం

రాజానగరం: హిందూ సంప్రదాయాలు, సంస్కృతులను ప్రతిబింబించి, తెలుగుదనం ఉట్టిపడేలా చేసే పండగలలో సంక్రాంతి ప్రధానమైనది. నియోజకవర్గంలో సోమవారం వేకువజామునే భోగి మంటను వెలిగించడంతో మూడు రోజుల సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లోని పల్లెలు భోగి వెలుగులతో తెల్లారాయి. సంబరాల్లో తొలి రోజు పండగ భోగి. దీనిని చిన్నారుల పండగ అని కూడా అంటారు. చిన్నారులకు పెద్దలు భోగి పండ్లు పోసి ఆశీస్సులందజేశారు. మరునాడు సంక్రాంతి, తర్వాత కనుమ పేర్లతో మూడు రోజుల సంక్రాంతి పండగను బంధుమిత్ర సమేతంగా కుటుంబ సభ్యులంతా కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకొంటారు.

సంప్రదాయబద్ధంగా..

ఉత్తరాయణ సూర్యుడు రాబోతున్నాడనే దానికి సంకేతంగా ఈ భోగి మంటలు నిలుస్తాయి. దక్షిణాయంలో ఉండే నిద్ర బద్ధకంతో సహా పనికిరాని వాటన్నింటినీ దగ్ధం చేయాలనే సంకేతంతో తెల్లవారి వెలుగురేఖలు రాకుండానే భోగి మంటలు వెలిగించడం పరిపాటి. పెరటిలో ఉండే పనికిరాని కలప, సామగ్రిని, ఎండు కొమ్మలు వంటి వాటిని దారిద్ర్య చిహ్నాలుగా భావించి, ఈ మంటల్లో వేసి తగులపెట్టి, కొత్తదనానికి స్వాగతం పలుకుతారు. ఈ కారణంగానే వయస్సుతో నిమిత్తం లేకుండా పిల్లలు, పెద్దలు వేకువజామునే లేచి, నలుగుపిండితో శరీరాన్ని రుద్దుకుని, తలంటు స్నానం చేసి, కొత్త బట్టలు ధరించి, భోగి మంటలు వెలిగించారు. ఆ మంటల ముందు కూర్చుని అప్పటివరకు వణికించిన చలిని కూడా మరచిపోయారు. నెల రోజులుగా తయారు చేసిన భోగి పిడకలను దండలుగా గుచ్చి, ఈ మంటల్లో వేసి చిన్నారులు ఆనందిస్తుంటే, వారిని చూసి పెద్దలు సంబరపడ్డారు.

ఆలయాలు కిటకిట

భక్తులు తమ ఇష్టదైవాలను దర్శించుకోవడంతో పలు దేవాలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా కొంతమంది భక్తులు సాయంత్రం భజనలు కూడా చేశారు. అలాగే సాయంత్రం కొంత మంది తమ ఇళ్లల్లో బొమ్మల కొలువును ఏర్పాటు చేయగా, మరికొంత మంది భోగి పండ్ల పేరంటాలు జరుపుకొన్నారు. ఈడు వచ్చిన ఆడపిల్లలకు దిష్టి లేకుండా చేసేందుకే ఈ పేరంటాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇక డూడూ బసవన్నల హడావిడి, హరిదాసు సంకీర్తనలు షరా మామూలే.

నేడు సంక్రాంతి

సంబరాల్లో రెండో రోజు పండగను మకర సంక్రాంతిగా జరుపుకొంటారు. పల్లెల్లో ప్రతి ఇంటిలోను పాలను పొంగించి, పలు రకాల మిఠాయిలు చేసుకుని ఆరగిస్తారు. ఇళ్లకు వచ్చిన బంధువులకు, స్నేహితులకు, ఆప్తులకు వాటిని పంచి ఆనందిస్తారు. అంతా కొత్త దుస్తులు ధరించి ఈ పండగను ఆస్వాదిస్తారు. ప్రతి సంక్రమణానికి పితృ తర్పణాలు ఇవ్వాలి కానీ, మిగిలిన 11 సంక్రమణాలకు ఇవ్వకపోయినా, ఈ మకర సంక్రాంతికి మాత్రం తప్పకుండా పితృ తర్పణం ఇస్తుంటారు. పెద్దల పండగ అని కూడా దీనికి పేరుంది.

రేపు కనుమ

ఇది పూర్తిగా వ్యవసాయ రంగానికి చెందిన పండగ. వ్యవసాయంలో తమకు చేదోడు వాదోడుగా నిలిచి, తమ కోసం శ్రమించే పశువులకు కర్షకులు పూజలు చేయడం ఈ పండగ ప్రత్యేకత. బండి ఎడ్లను అందంగా అలంకరించి, పిల్లాపాపలతో వాటిపై పరుగులు తీసి ఆనందిస్తారు. అంతేకాక మాంసాహారులకు ఈ పండగ పూర్తి పుష్టిని ఇస్తుంది. పలురకాల మాంసాహార వంటలతో కడుపునిండా ఆరగిస్తారు. కనుమ మరుసటి రోజును ముక్కనుమ అంటారు. నెల రోజులుగా వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి సంబరాలకు శ్రీకారం చుట్టిన మగువలు ఈ రోజు రథం ముగ్గు వేసి, ముగింపు పలుకుతారు.

మెట్టలో కోడి పందాలకు సై



కోడి పందేలు ఆడే బరిలో గుండాట జోరు



ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో కోడి పందేలు

రాజానగరం: రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు కేరాఫ్ అడ్రస్‌గా పేరొందిన రాజానగరం మండలం కోడి పందేలకు కూడా చిరునామాగా మారింది. సంక్రాంతి పండగ సమయంలో కోడి పందేల బరిలో కోట్లాది రూపాయల బెట్టింగులు చేసేందుకు పందెరాయుళ్లు సిద్ధమయ్యారు. ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో మరీ కోడి పందేలు ఆడే విధంగా ఏర్పాట్లు చేశారంటే వాటి జోరు ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. రాజానగరం మండలంలో శ్రీరామపురం, పుణ్యక్షేత్రం, దివాన్‌చెరువు (పాలచర్ల), నరేంద్రపురం, ముక్కినాడపాకలు, జి.యర్రంపాలెం, కోరుకొండ మండలంలో గాదరాడ, కోరుకొండ, బూరుగుపూడి, దోసకాయలపల్లి, నిడిగట్ల, సీతానగరం మండలంలో పెదకొండేపూడి, ఉండేశ్వరపురం, మిర్తిపాడు, రూరల్ పరిధిలోని తొర్రేడు ఏరియాల్లోని తోటలలో కోడి పందేల బరులు ఏర్పడ్డాయి. ఈ బరులలో కోడి పందేలతో పాటు, కాయ్ రాజా కాయ్ అంటూ సాగే గుండాటల ద్వారా ఒక్కో బరిలో రూ.5 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు పందేలు జరగనున్నాయి. ఇలా సంక్రాంతి పండగ మూడు రోజులు కోడి పందేల పేరుతో రూ.ఆరు కోట్లకు పైబడి బెట్టింగులు జరిగే అవకాశాలున్నాయి.

40 టన్నుల కలపతో భోగి మంట



కొమరిపాలెంలో ఏర్పాటు చేసిన భారీ భోగి మంట

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలో సోమవారం 40 టన్నుల కలపతో భోగి మంట ఏర్పాటు చేశారు. జిల్లాలోని అత్యధిక భోగి మంట ఇదే కావడం విశేషం. ఈ భోగి మంటను ద్వారంపూడి వెంకటరెడ్డి (డీవీ) ఏర్పాటు చేశారు. సుమారు 20 అడుగుల ఎత్తు, 40 అడుగుల విస్తీర్ణంతో క్రేన్ సహాయంలో ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా పూజలు చేసి, మంటను వెలిగించారు. మాజీ జెడ్పీటీసీ పడాల వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు భోగి పండ్లు.. ఆడపిల్లలతో గొబ్బెమ్మ పూజ



రాజానగరంలో చిన్నారులకు ఆశీస్సులందజేస్తున్న పెద్దలు

రాజానగరం: సంక్రాంతి సంబరాలలో భాగంగా భోగి పండగ రోజున చిన్నారులకు భోగిపండ్లు(రేగుపండ్లు) పోయడం, ఆడపిల్లలతో గొబ్బెలను పెట్టించి, పూజలు చేయించడం ఆనవాయితీ. ప్రస్తుత కాలంలో ఈ సంప్రదాయానికి ప్రాధాన్యం తగ్గకపోవడం విశేషం. గ్రామీణ ప్రాంతాలలో ఆడ పిల్లలున్న ఇంటి ముంగిట వాకిళ్లలో ఈ గొబ్బెమ్మలను పెడతారు. సోమవారం సాయంత్రం కొంతమంది ఔత్సాహికులు తమ వాకిళ్లలో గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి, 'గొబ్బి గొబ్బెమ్మ సుబ్బనివ్వవే, అరటి పువ్వంటి అన్ననివ్వవే, చామంతి పువ్వంటి చెల్లినివ్వవే, తామరపువ్వంటి తమ్ముడినివ్వవే..' అంటూ సంప్రదాయ పాటలు పాడుతూ ప్రదక్షిణలు చేశారు. ధనుర్మాసం ప్రారంభం నుండి సంక్రాంతి వరకు ఆడపిల్లలతో ఈ విధంగా చేయించడం పూర్వం నుండి వస్తున్న ఆచారాన్ని, నేటి తరం మహిళలు తమ తర్వాత తరాల వారితో ఆచరింపజేయడం హర్షణీయం.

ఊపందుకున్న గుండాట, కోడి పందేలు



బూరుగుపూడిలో గుండాట నిర్వహిస్తున్న స్థానికులు

మధురపూడి: సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు జోరందుకున్నాయి. కోరుకొండ మండలంలోని 22 గ్రామాల్లో 11 బరులను ఏర్పాటు చేశారు. నిర్వాహకులు గుండాటలాడించి, ప్రజల సొమ్మును కాజేశారు. కొందరు కూటమి నేతల అండదండలతో అసాంఘిక కార్యకలాపాలు ఊపందుకున్నాయి. గుండాట నిర్వహణ సందర్భంగా పలు గ్రామాల్లో స్థానికులకు, నిర్వాహకులతో వాగ్వాదం జరిగింది. రాత్రి వేళల్లోనూ పందేలు జరిగాయి. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో ఫ్లడ్‌లైట్లతో జూదాలు నిర్వహించారు. అలాగే బరులు ఉన్న ప్రదేశాలకు దూరంగా పేకాటలు కొనసాగించారు. పోలీసుల జోక్యం లేకపోవడంతో విచ్చలవిడిగా పందేలు నిరాటంకంగా కొనసాగాయి.

ఎయిర్‌పోర్టుకు సంక్రాంతి హంగులు



విద్యుత్ అలంకరణతో విమానాశ్రయ టెర్మినల్

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయంలో టెర్మినల్ భవనాన్ని సంక్రాంతి కళ ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. విమానాశ్రయంలోని ప్రాంగణం, టెర్మినల్ భవనాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వర రావు ఆధ్వర్యంలో సంప్రదాయ పండగకు అద్దం పట్టేలా ఎడ్లుల బండి, కోడిపుంజులు, పాడిపంటల బొమ్మలను ఏర్పాటుచేశారు. ప్రయాణికులను ఇవి ఆకట్టుకున్నాయి.



టెర్మినల్ భవనంలో ఎడ్లుల బండి

గ్రామీణ సంస్కృతులను ప్రోత్సహించాలి

ఎస్సై రామారావు



కరకుదురులో ముగ్గుల పోటీ విజేతకు బహుమతి అందజేస్తున్న ఎస్సై రామారావు

పెదపూడి: గ్రామీణ ప్రజల్లో ఉన్న ప్రతిభ, సృజనాత్మకతను వెలికితీయడానికి సంక్రాంతి సంబరాల పోటీలు దోహద పడతాయని ఎస్సై కె.రామారావు అన్నారు. కరకుదురు గ్రామంలో తలాటం మురళీకృష్ణ సేవకీయం ట్రస్ట్ అధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై రామారావు హాజరయ్యారు. పోటీల్లో సుమారు 50 మంది మహిళలు పాల్గొనగా, వారిలో రోకల దేవి, బెజ్జవరపు శ్రీలక్ష్మి, లక్ష్మీదుర్గాదేవి ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. వీరికి వరుసగా రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారికి కన్సొలేషన్ బహుమతులు అందించారు. ఎస్సై రామారావు మాట్లాడుతూ, ట్రస్ట్ చైర్మన్ మురళీకృష్ణ, మిత్ర బృందం పోటీలను ఉత్సాహంగా నిర్వహించారని అభినందించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ, ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలతో పాటు, క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉండ్రు చంద్రకళ, పెద్దా డీసీ చైర్మన్ సానా శ్రీను, మాజీ సర్పంచ్ సింగినీడి నాగతిరుపతిరావు, మాజీ ఉప సర్పంచ్ పాటంశెట్టి త్రిమూర్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



కొంకుదురులో కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రామంలో కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. సంక్రాంతిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో 22 పురుషుల జట్లు, 4 మహిళల జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొవ్వూరి వేణుగోపాల రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, ఎస్వీ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే రంగాపురం గ్రామంలో ముగ్గుల పోటీల విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. ఇలపల్లి గ్రామంలో తణుకు శ్రీధర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు



సంపరలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న హనుమంతాచార్యులు

రాజానగరం: గ్రామంలోని వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వస్తు సామగ్రిని సమకూర్చి, ఏర్పాట్లను చేసిన కె.రామలింగేశ్వరరావు దంపతులను భక్తులు సన్మానించారు.

పెదపూడి: పెద్దాడలో గోదాదేవి సమేత అభినవ వేంకటేశ్వర స్వామి, పెదపూడిలో జనార్దన స్వామి ఆలయంలో, సంపరలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో రంగనాథస్వామికి గోదాదేవి కల్యాణం జరిగింది. సంపరలో ఖండవిల్లి హనుమంతాచార్యులు, ఫణిశ్రీ దంపతులు నిర్వహించారు.

మధురపూడి: కోరుకొండ రంగనాథస్వామి ఆలయంలో గోదా రంగనాథ స్వామివారి తిరు కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

సీతానగరం: స్థానిక విష్ణాలయంలో గోదా రంగనాథ స్వామివారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మద్దూరి నాగార్జునశర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం జరిగింది.

రఘుదేవపురంలో ట్రాఫిక్‌కు అంతరాయం

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో సోమవారం రాత్రి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. పండగ సందర్భంగా పలు వాహనాల రాకపోకలతో ఇరుకుగా ఉన్న రోడ్లలో ట్రాఫిక్ స్తంభించింది. అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. నాలుగు లైన్ల రోడ్డు రఘుదేవపురం శివారు వరకు పూర్తయింది. రఘుదేవపురం నుంచి సీతానగరం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోవడంతో రోడ్డు ఇరుకుగా మారింది. భారీ వాహనాలు ఎదురుపడితే తప్పుకోవడానికి కష్టతరమవుతోంది. ఆక్రమణలు తొలగించి, రోడ్డును విస్తరించే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బంధుమిత్రులతో పల్లెల కళకళ

ఘనంగా ప్రారంభమైన సంక్రాంతి వేడుకలు



పందలపాకలో భోగి మంటలో పిడకల దండ వేస్తున్న చిన్నారులు



పందలపాకలో సంక్రాంతి ముగ్గు



సీతానగరంలో భోగి మంట వేస్తున్న స్థానికులు



పెదపూడిలో నూనివారి వీధిలో వేసిన భోగి మంట

బిక్కవోలు: సంక్రాంతి సందర్భంగా పల్లెలు కళకళలాడుతున్నాయి. పట్టణాల్లో ఉన్న పల్లెవాసులు పండగ సందర్భంగా సొంత గ్రామాలకు చేరుకోవడంతో పల్లెల్లో సందడి నెలకొంది. సోమవారం భోగి పండగకు ఆదివారం సెలవు రావడంతో, శనివారం రాత్రి నుంచి పట్టణాల నుంచి బంధువులు, మిత్రులు, కుటుంబ సమేతంగా పల్లెలకు చేరుకున్నారు. కొత్త అల్లుళ్లతో ఇళ్లు కళకళలాడుతున్నాయి. హరిదాసుల హరినామ కీర్తనలతో వీధులు సందడిగా ఉన్నాయి. మహిళలు పోటీ పడి ఇళ్ల ముంగిట రంగవల్లులు వేశారు. యువకులు ఉత్సాహంగా భోగి మంటలు వేసి వేడుక నిర్వహించారు. అనపర్తి నియోజకవర్గంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లోని గ్రామాల్లో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో భోగి పండగ వేడుకలను ప్రజలు వైభవంగా జరుపుకొన్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ప్రజలు భోగి మంటలు వెలిగించారు. కొందరు ఈ మంటల్లో భోగిజావను పొంగించి, గొబ్బెమ్మ ఆట ఆడారు. మండలంలోని పెదపూడి, పెద్దాడ, జి.మామిడాడ, రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు, సంపర, కాండ్రేగుల, శహపురం, గండ్రేడు, పుట్టకొండ, కుమారప్రియం, చింతపల్లి, వేండ్ర, పైన, రాజుపాలెం, దోమాడ, కైకవోలు తదితర గ్రామాల్లో వేడుకలు జరిగాయి.

సీతానగరం: మండలంలోని వివిధ గ్రామాల్లో భోగి మంటలు ఏర్పాటు చేసి, గోవు పిడకల దండలను మంటల్లో వేశారు. వేకువజామునే గోదావరి పుణ్యస్నానాలాచరించి, ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారిని దర్శించారు. ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. రాపాకలో పాలకుర్తి శివ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఆవుపేడ, ఆవు పంచకంతో తయారు చేసిన లక్ష వెయ్యి నూట పదహారు భోగి పిడకలను భోగి మంటల్లో వేసి, సంప్రదాయబద్ధంగా భోగి పండగ జరిపారు. మండలంలోని పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, చినకొండేపూడి, పెదకొండేపూడి, నాగంపల్లి, చీపురపల్లి, సీతానగరం, రఘుదేవపురం, ముగ్గళ్ల, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, రాజంపేట, మునికూడలి, కాటవరం, జాలిమూడి, బొబ్బిల్లంక, ములకల్లంక, మిర్తిపాడు, ఉండేశ్వరపురం, కూనవరం గ్రామాలలో భోగి పండగను ఘనంగా జరుపుకొన్నారు.